# కల్యాణి

రాయసం వెంకట శివుడుగారు, యమ్. ఏ., యల్. టి.

౧

ఏకాదశి నాఁడు ప్రయాణమువలదని మా తల్లి గట్టిగాఁ జెప్పెను. మఱునాఁడు వేకువనే ద్వాదశిపారణ చేసికొనిపోవుట యుక్తమని యామె బోధించెను. ఐన నే నానాఁడే బయలుదేర వలసివచ్చెను. ద్వాదశి పారణ సమయమునకే పట్టణము చేరెదనని నేఁదలంచితిని. కాని, మఱునాఁడు ప్రాతఃకాలమున కింకను ఎంత యోదూరము పోవలసియుండెను. పడవ మెల్లిగనడకలు సాగించుచుండెను. వేగముగఁ బోవునని నే నాశించిన కొలఁదిని అది వెనుకంజ వేయుచుండెను! తొందరయంతయు నాకేనా, యింకెవరికిని లేదా యని విచారింపఁగా, ప్రయాణికులందఱును వేగముగ నిలుచేరవలయుననియే యాతురతతో నుండుట గాంచితిని. ఇంతలో సూర్యోదయమయ్యెను. ఆదినము సూర్యుఁడతివేగముగ నాకసమునఁ బరుగెత్తునట్లు కానఁబడెను. ఇపుడు నాలుగు గడియల ప్రొద్దెక్కినది. ఈ రీతినిఁ బడవ నడచిన యెడల, నేఁడును నాకేకాదశియే కాఁగలదని నే భయపడితిని!

మా మాధ్వుల కేకాదశి యత్యంత పవిత్ర దినము. పెద్దలందఱు ఉపవసింతురు. యౌవనము దాఁటుచున్నప్పటికే [illegible]ములు కట్టిపెట్టుట కలవాటు చేసికొందురు. ఈ కలికాలమందైనను, ఏకాదశినాఁడు అన్నము నోట గట్టుకొనువారు మాలో నంతగ నుండరు. అన్నము తిను పిల్లలును సొజ్జె భుజించితిమని చెప్పుట మరియాద. నిరాహారులుగ నుండలేనివారు సయితము ఉపవాసముంటిమని చెప్పక తప్పదు.

నేను వెనుకటి దినము భోజనము చేసినను — క్షమింపుడు — ఫలాహారము చేసియుండినను, సూర్యోదయముతోనే నాకు జఠరాగ్ని తీవ్రతఁ దాల్చియుండెను. ఏకాదశీ వ్రతనిష్ఠ లేకుండియు, ద్వాదశీపారణకు నేను సంసిద్ధముగ నుంటిని. కాని, ప్రస్తుతావస్థలో నాకు మెతుకులెట్లు లభింపఁగలవు? పదిగంటలగునప్పటికే నాకెక్కుఁవ యాఁకలియయ్యెను. లోపలను బైటను మండిపోవుచుండెను. ఇంట భోజనమున కింత యాలస్యమైనచో, ఆగ్రహావేశమున మా తల్లిని మ్రింగివేసియుందును. ఇచట నెవరిమీఁద నా కోపము చూపించనగును?

మొదలకడనే పట్టణము చేరుదునని తలంచితిని గాన నా యొద్ద తినుటకు కాయ కసరులేవియు లేవు. చేసిన చేసుకొనుటకు లేకపోవుటచేత, మిఠాయి మొదలగున

దొరకకుండెను. ప్రొద్దుననుండియుఁ గడుపులో నేమియు పడకపోవుటచేత, చెవులు గడియలు పడసాగెను; కన్నులు మసకలు గ్రమ్ముచుండెను. ఇంక నీయాకలికిఁ దాళఁజాలనని దగ్గఱనుండు వారితోఁ జెప్పివేసితిని. ఎవ రేమి చేయఁగలరు ?

పడవ మొదటి గదులలో నొక యుద్యోగస్థుఁడు కుటుంబముతోఁ బయనము చేయుచుండెను. అంతట సరంగు పడవమీఁద నుండి దిగి వచ్చి, తహసీలుదారుగారు నిన్నుఁ బిలుచుచున్నారని చెప్పెను. కడుపుమండి పోవుచుండువానికి గొప్పవారితో గోష్ఠియెట్లు? ఐనను పెద్దలమాట తీసివేయఁజాలక, నేను లేచి, పడు చెక్కమీఁద నడచిపోయి, గది ముందు గుమ్మముఁ జేరితిని. పెద్ద యుద్యోగస్థులకుఁ బేద విద్యార్థితోఁ బనియేమి గలిగెనా యని నే నచ్చెరువొందితిని.

న న్నాహ్వానముఁ జేసినది భానోజిరావు పంతులుగారు. భానోజీరావుగారి పే రెఱుఁగని వారెవరు ? ఆయన ప్రాతఃకాలపు ఉద్యోగస్థుఁడయ్యును, ముసద్దియని ఖ్యాతి నంది యుండెను. తాలూకా నంతటిని గజగజ వణఁకింపఁగల సమర్థుఁడు. ఈ ప్రాంతమున మా మాధ్వులలో నుద్దండుఁడు. ఈ కులశేఖరుని యండఁజూచుకొనియే మా వ్యాపారులు తలలెత్తుకొని యుండిరి. అట్టి పంతులువారి దర్శనము చేయునపుడు, అపరిచితుఁడను నావంటి పసిబాలుఁడు వణఁకుటయం దేమి యాశ్చర్యము ?

"నీవు బ్రాహ్మణ పిల్లవాఁడవే కదా?" యని పంతులు ప్రశ్నము.

"ఔనండి - మేము వేపారులము" అని నా యుత్తరము.

అంత మా యుభయులకును మా కుటుంబపు పూర్వోత్తరములను గుఱించి సంభాషణము జరిగెను. ఐన ఇట్టి కుశల ప్రశ్నములవలన నాకు గడుపు నిండునా ? పంతులంత తన వెనుకటి గదితలుపు తట్టి, "కల్యాణీ! కల్యాణీ ! " యని పిలిచెను. పదునాలు వత్సరముల వయసు గల సుందరి యొకతె, చదువుచుండు పుస్తకమును నొకదానిని గ్రింద నుంచి, "అయ్యా!"యని నిండుచందురునిబోలు మోముతో తలుపునందునుండి చూచెను.

"చూడు, కల్యాణీ! ఈ పిల్లవాఁ డెవరో తెలుసునా ? మా సీనయ్య మామ పెదమామగారి మనుమఁడు. మనకు కావలసిన వాఁడు. ఆకలిగొనియున్నాఁడు. నీవు లేచి, ఫలాహారపు మూట విప్పు. ఈ రోజు పడవ మూఁడు జాములకుఁగాని యూరు చేరునని తోఁచదు. ఫలాహారము చేయండి!" అని పంతులు పలికి, కాలుచేతులు గడుగుకొనుమని చెంబు గట్టిన త్రాఁడు నాకందిచెను. పాదప్రక్షాళనము చేసికొనుచుండఁగా, లోని సంభాషణ నాకొకింత వినవచ్చెను. "నాకు వద్దండీ ! ఆక లేమీ లేదు. ఇదిగాక, ఏకాదశి ఉపవాసమున్న మిమ్ము విడిచి, మీ ద్వాదశి పారణ కానిదే, తగుదునమ్మాయని నేను ఫలాహారమునకుఁ గూర్చుందునా ? నేనింత ప్రొద్దుననే భోజనము చేయుటకు సనుశ్మాన

దివసములు వచ్చినవా యేమి ? పిల్లవానికి మాత్రము ఫలాహారము పెట్టెదను !"

"కాదు కల్యాణీ! నీవొళ్లు మంచిది కాదు. నీవు ఉండలేవు. నా మాట విందూ, మంచి దాన..." ఈ కడపటి మాట పూర్తిగాక మున్నే నేను గది గుమ్మము నొద్దకు మరల వచ్చితిని. ఆ ముద్దియ ముంగురుల మీఁద నున్న తన వ్రేలిని పంతులు వేగమెతీసుకొని, "మఱి యింక లే ! రా అబ్బాయీ! కూర్చో!" అని నన్ను సంబోధించెను

నా ముందొక యరటియాకుముక్క వేసి, యా చేడియ, చేత బంగరు కంకణములును, చిన్న వ్రేలిని పచ్చలుతాపిన యుంగరమును, తళ్కుమనుచుండఁగ, కొంత పులియోర పెట్టెను. పులియోరనిన నాకు జిన్నప్పటినుండియు ననిష్టము. ఐన నేఁ డీ భాగ్యశాలిని దయతో నిడిన వస్తువును నేనెట్లు పరిహరింపను ? కాలుచుండు కడుపునకు సూడిదలు గావలయునా? నానోటి కాయాహారమమృతమయ్యెను. ఇట్టి రుచ్యమగు పదార్థము నిన్నాళ్లు నేనేల యీసడించితినాయని యాశ్చర్యమందితిని. తమకమున భుజించు నాకంత కారముచే నెక్కిళ్లు రాఁగా, "కారమెక్కువయైనదేమి ? నాకును అదియే బాధ. మఱచిపోతిని. ఈ మీఁగడ కలుపుకో!" అని చిన్నగిన్నెలోని మీఁగడ కొంచె మామానిని నాకు వడ్డించెను. అంత పంతులు, "కల్యాణీ! నామాట వినుదూ ! చూచినావా, ఇతఁడు మన మాధ్వుల పిల్లవాఁడే. మీబోటి చిన్నవాళ్లు తినుటవల్ల దోషమేమీ లేదు !" అని తిరిగి యామెను బుజ్జగించెను. వెండి గిన్నెలో నపుడు తానును గొంత వడ్డించుకొని, యా కోమలి భుజించుట కారంభించెను. భామినులతోడి భోజనప్రసంగములందు ప్రాఁత చుట్టరికములు బయలువడుచుండును. నాతో మాటాడుచు, కొంతవడి కాకోమలి యాశ్చర్యమున, "ఏమండీ! ఇతఁడు మీకేకాదు, మాకును దగ్గఱ చుట్టమే సుమండీ ! మాకు వ్రేలువిడిచిన అక్కకుమారుఁడు!" అని పతితోఁ బలికెను. ఉభయులకును జుట్టమునైన నన్నింకను భుజింపుమని వారు బుజ్జగించిరి. ఫలాహారానంతరము, జవానుచే నామూటను దమ గదిలోనికిఁ బంతులు తెప్పించి, "ఎంత పని చేసితివి చిట్టిపంతులూ ! ఇంతఆకలి పెట్టుకొని, బంధువులము మేము కూర్చుండ పడవలోనే గతిలేనట్టుగఁ గష్టపడితివిగదా ! " అని యాశ్చర్యము నందెను.

౨

పడవ పయనమునాఁట నుండియు భానోజిరావు పంతులు నాకుఁ బరిచితులై యుండిరి. పంతులు బంధు ప్రియుఁడు, స్వశాఖాభిమాని, దినము నెప్పుడో యొకప్పుడు తనకుఁ గనపడుమని నాకాయన యానతిచ్చెను. వారింటి కేగినపుడు జవానుల నడుగక యే నేను దిన్నగ లోనికిఁజని వారిని సందర్శింపవచ్చును. వారికి నాయందుఁగల వాత్సల్యత యింతింతని చెప్పఁజాలను. ఆయన నేను గనఁబడఁగానే "నాయనా, మనోహరమూ, రా! కూర్చో!" యని తానెంతపనిలో నున్నను, నా యోగక్షేమము లారయుచుండును. పదునాఱు వత్స

రముల లేఁబ్రాయముననున్న నాతో వయసు మీఱిన ప్రజ్ఞావంతుఁడగు తాను ప్రాణస్నేహితునివలెఁ బరియాచకము లాడును. పూటకూళ్లమ్మ చేతియన్నము అర్భకుఁడనగు నాకు సరిపడదనియు, తన యింటనే విడిసి, తన సహపంక్తిని భుజింపుమనియుఁ బంతులు బలవంతపెట్టుచుండును. ఇట్టి యాదరమును జూపుచుండుటచేతనే నాయనను మానాయనకు మారుగఁ జూచుకొనుచుందును. ఇంకఁ గళ్యాణమ్మకంటె గుణవతి యగు నిల్లాలు నా కంటి కిలలోఁ గానిపింపలేదు. నా యీఁడు గలదియె యైనను, నే నామానవతిని బినతల్లిగ భావింతును. మాయమ్మకుఁ జెల్లెండ్రు లేరు. కక్కీయని పిలిచి, నాకుఁ బినతల్లి లేని కొఱంతను దీర్చిన యాకోమలియందుఁ గూర్మి గలిగియుందును. ఇంతేల? నాయందు పుత్రవత్సలత గల కల్యాణమ్మనుజూచి నేను దల్లిని విడిచిన విచారమును మఱచిపోతిని. నా నేమ మాసుదతి యెన్నిరీతులనో కనిపెట్టుచుండును. తినుటకు ఫలాదులు, చదువుకొనుటకుఁ బుస్తకములును ఆయమ యనుగ్రహమున నాకెన్నిసారులో సమకూరెను. సతి, నాయెడఁ జూపెడి యాదరమునకుఁ దనివినొందనివానివలె పంతులింకను నామీఁద దయ గురిపించుచుండును.

ఇట్లెంతకాలము గడచెనో నాకుఁ దెలియదు. సుఖదినములు శుక్లపక్షపు చంద్రికలవలె శీఘ్రమే పరిసమాప్తినొందును. ఒక సాయంకాలము నాకేమియుఁ దోఁపకుండెను. పుస్తకమును విసుగుదలతో మూసివైచి, ఎప్పటికంటె వేగమె పచేరమునకు సాగిపోతిని. నాకుఁ దెలియకయె పాదములు పంతులుగారి యింటిత్రోవఁ దీసెను. మా కక్కీ యిపుడేమి చేయుచుండునా యని యూహింపఁదొడంగితిని. నేను గనపడఁగనే లేచి నమస్కరించు పంతులుగారి జవాను నాఁడు, నన్నుఁ జూడనివానివలెఁ గాళ్లుచాచి కూర్చుండియుండెను! ఒకటిరెండుపర్యాయములు పలుకరించినఁగాని వాఁడు పలుకకుండెను! ఇల్లుసొచ్చినను, నన్నాదరించువారు లేరైరి! నేనపుడు అమ్మగారి గదిగుమ్మము నొద్దకుఁబోయి నిలుచుంటిని. తానెంత జబ్బుగనున్నను, ఎదురుగ వచ్చి నన్ను గారవించెడి కల్యాణమ్మ, నన్నిపుడు చూచియు, మఱింత ముసుఁగుఁబెట్టుకొని కదలకుండెను! దీనికిఁ గారణమేమి? “కక్కీ, కక్కీ! నీకు జబ్బుగానున్నదా యేమి?” అని హెచ్చరించితిని. ప్రత్యుత్తరము లేదు. అంత నేమనుకొనినదో కాని, కొంతవడికి మా పిన్నమ్మ లేచి, మంచముపట్టెమీఁద దాఁ గూర్చుండి, కుర్చీలో నన్నుఁ గూర్చుండుమని సైగచేసెను. వీడిన కురులు ముఖపద్మమును గప్పుచు, ఆ సుందరవదనమున కొక వింత వికాసమును గల్పించెను. ఎన్నిమారులో నాకుఁ బ్రేమాతిరేకమున ఫలాహారములిడిన యా మృదువగు చేతివ్రేళ్లు, మందమారుతమునఁ జలించు లేమావి చివురుటాకులవలె భావోద్రేకమున నిపుడు కంపింపసాగెను. “కక్కీ! నీ వీలాగున నుంటివేమి? బడలికచేతనా, విచారముచేతనా? కుమారుఁడై [illegible] నాదగ్గఱ నీకు దాపఱిక మెందుకు?” అని

యాత్రమునఁ బ్రశ్నించితిని. దుఃఖావేశమున మాటరాక, ఆతరుణి దుర్బలత్వమున నూరక క్రిందికిఁ జూచుచుండెను. శీతకాలపు టుదయమునఁ జెట్లయాకులనుండి రాలు మంచు బిందువులవలెనే యాకాంత కనుదోయినుండి బాష్పజలములు జలజల రాలుచుండెను! మందహాసమునకే యనువగునటులు ధాతచేఁ బరికల్పింపఁబడిన యా కోమలి కపోలతల మిపుడు కన్నీటిధారలచే వివర్ణతనొందుటకు నే నోపక, "కక్కీ! నీ వొకమాటాడి, నా హృదయమును వేధించు బాధను తొలఁగింపవా?" యని దైన్యముతో నే వేఁడితిని.

కల్యాణమ్మ యంతట, "అబ్బాయీ! నీతో నొకమాటే చెప్పెదను. వెనుకటిసంగతులు కలవంటివని మఱచిపోయి, ఇఁకముందు మాయింటికి రాఁబోకు. ఇదే మా యుభయుల యభిప్రాయము" అని చెప్పివైచెను!

మొదలంటనరికిన కదళీకావృక్షమువలె నే నంత నేలఁ గూలఁబడితిని. ఈ లోకమున ప్రియతమమగు చుట్టము నెచ్చెలియగు నీ సుదతీరత్నమునకు నామీఁద నిటు దయతప్పుటకుఁ గారణమేమి? ఇట్టి స్నేహితులను గోలుపోయిన నా జీవిత మిఁక వ్యర్థ మని నే రూఢిచేసికొంటిని. ఐనను, ముఖాముఖి మాటాడుకొనిన నెట్టి యపోహములు నొక్కొక్క క్షణము సమసిపోఁగలవని నమ్మి, "కక్కీ! నా తప్పిదమును నీవు సూచింపనైనలేదు; నిరపరాధినైన న న్నూరకయే దయమాలి యిట్లు శిక్షించుట నీకు న్యాయమా?" యని నేనడిగితిని. నాసంగతి సవిస్తరముగ విని మఱి [illegible] విధింపుఁడని వేఁడితిని. ఆ నొకవేళ నాతో మాటాడ నొల్లకున్నను, పంతులుగారైన నాతోఁ బ్రసంగించి, సత్యాసత్యము లరయునటులు చేయుఁడని ప్రార్థించితిని. కాని యా సుదతి స్థైర్యముఁ బూనియుండెను. సంతతధారగఁ బ్రవహించుచుండిన బాష్పజల మిపుడు నిలిచిపోయెను. దుఃఖముతోఁగాక, కోపముతోనే యిపు డాసుందరవదన ముద్దీప్త మగుచుండెను. పదునెనిమిదివత్సరములు నిండకుండెడి యా జవ్వని మోమును, ఆగ్రహపిశాచము ముప్పదియేండ్ల భామిని వదనముగ మార్చివైచెను! నేఁ బలికిన పలుకులును చేసిన ప్రార్థనలును, ఆ కలికి యొకింతయు నాలకింపక, నావైపునకు దృష్టినైన మరలింపక, "పో పొమ్ము" అను నర్థము వచ్చునట్టుగఁ జేయి విచివైచెను! అకారణవైర మూనిన యంగనతోడి ప్రసంగ మనుచితమని తలంచి, ఉత్తరీయము నెత్తి కట్టిచుట్టి, ఆ గృహాము నుండి మరలిపోతిని.

ఎక్కడకుఁ బోవుటకును, ఏమిచేయుటకును, పాలుపోకుండెను. సమీపమున నే పౌరుల విశ్రాంతికొఱ కేర్పడిన పూఁదోట గలదు. మెల్లగ నడుగులిడుచు నే నందుఁ జొచ్చి, చెట్ల గుబురునడుమఁ జదికిలఁబడితిని. అప్పటికి సూర్యాస్తమయమైనది. సంజచీఁకటి రాత్రి యగుటచేత నొక కొన్ని నిముసములకే యాస్థల మంధకారబంధుర మయ్యెను. ప్రస్తుత పరిస్థితుల నే నంతఁ దలపోసితిని, నా దుస్థితి నెవరి కారోపించుటకును, దానికై యెవరిని దూఱుటకును, నాకుఁ [illegible]

యూహాపోహములు స్తబ్ధములై యుండెను. కొంత సేపటి కిద్దరు మనుష్యులు తోటలోఁ బ్రవేశించి, నే నుండుచోటునకుఁ జేరువనె వేదికమీఁదఁ గూర్చుండి, మెల్లగ ముచ్చటింపసాగిరి. ఎవరికో భయము వారిది! నా గోడవలోఁబడియున్న నా వీనులకు వారి గొడవ వినవచ్చియు వినరాకుండెను. కొంచెము సేపటికి వారిమాటలధోరణి నా చెవులకుసోకెను. 'లోకాభిరామాయణముతోఁ బ్రసంగ మారంభించి, యా మనుష్యులు, రానురాను మాకు సంబంధించిన విషయములకు దిగిరి. ఆశ్చర్యమందిన నా కంత వారి సంభాషణమందలి తుదిభాగ మిట్లు వినవచ్చెను.

మొదటివాఁడు: "ఐతే, బిందుమాధవా! మూఁడవ పెండ్లి చేసికొన్న ముసలిముండా వాఁ డీసంగతి మొదటనే యేల కనిపెట్టలేదు? లేక మీ బెండకాయబొట్టంటే పడి చచ్చుచుండుటచేత వాని కన్నులిట్లు పొరలు గ్రమ్మినవా?"

రెండవ వాఁడు: "నీవు చెప్పినట్లే, బంధుత్వ మమకారముచేతనే కుబ్జవానిని నెత్తెక్కించుకొన్నాఁడు. అంతట వాఁడు బిగిసి గొంతుపట్టుకొన్నాఁడు!"

మొదటి: "కుబ్జవాని కీమెతక గుణమున్నదని నీకేలా స్పష్టమైనది? తల్లీ బిడ్డలను వరుసపెట్టుకొనియేకదా వారుండిరి!"

రెండవ: "ఈ కలికాలపు వరుసల కేమివచ్చె! చెడు వ్యామోహాములేకపోతే, [illegible] బంధుత్వములేని ఆ కుబ్జగాడిద, ఏమి పడిపోయినదని వేళాపాళలేక, చదువు సంధ్యలు వదలి, వీళ్ల కొంపపట్టుకొని తిరుగుతాడు? వీనిమీఁది మోహాముచేతనే ఆవగలాడిదగ్గఱ బంధువులను సహా తనయింటి కిటీవల చేరనియ్యకున్నది! ఈ మాయ గ్రహింపని ముసలి పక్కనకిపుడు మనోహరమే ముద్దులమూటమైనాఁడు! కాఁబట్టియే మనోహరమిపు డాయింటి తహాసీలుదారు హోదా చలాయిస్తున్నాడు! ఒకటేల, మనోహరము దయ సంపాదించినవారే అక్కడ ధన్యులు. అటువంటి మహానీయుని కొమ్ములు మనము కోసివేయుట గొప్ప విశేషము గదా!"

మొదటి: "ఔను గాని, మనము వ్రాసిన యీ ఆకాశరామన్న యుత్తరాల వల్ల వాళ్లకు బుద్ధివచ్చునని యేలా చెప్పఁగలవు?"

రెండవ: "పరాంకుశమూ! తినబోతూ రుచి చూడడమెందుకు? ఈ యుత్తరాలు వాళ్లకు చేరినప్పటినుండి, సంగతులు మనము పరిశీలిస్తున్నాము గదా. ముసలతఁ డిప్పటికి కండ్లు తెరచినాఁడు. మనసులో అనుమానం అతనికి గాఢముగా నాటినది. అమ్మగారికి కూడా నసాళం అంటినది! ఉన్న సంగతి చెప్పితే ఉలుకెక్కువ! అయి వచ్చినదని యమ్మగారిపుడు మంచమెక్కినారు!

"తగిన ప్రాయశ్చిత్తము జరిగిందిలే! మా వంటి బంధువులంటే అమ్మగారి కిటీవల కళ్లు బొత్తిగాపూడిపోయినవి! మనోహరము నిఁక తమ యింటికి రానీయవద్దని భార్యా

భర్తలు నిశ్చయించుకొన్నారు. మనోవ్యథ చేతనే పంతులు నేఁటి మధ్యాహ్నము కమాను వెళ్లిపోయినాఁడు!"

ఈ సమాచారము నాకుఁ జాలును! నా కనుల పొరలిపుడు వీడినవి. నల్లనివన్నియు నీళ్లనియు, తెల్లనివి పాలనియు, దలంచి, వర్తనమున మాలిన్యములేదని విఱ్ఱవీగి, లౌక్యమెఱుఁగక యిన్నాళ్లును వర్తించిన నాకుఁ దగిన శాస్తియైనదని నే గ్రహించి, నేనంత మెలకువతో మెలంగ నుద్దేశించి, యిలు చేరితిని.

## 3

నిర్హేతుకముగఁ గుత్సితజనులు మోపిన యపనిందలకు వెఱఁగంది నాతోఁడి సంబంధమును వదలుకొనిన యా గృహస్థులను, నేను బిమ్మట చాలకాలము వఱకును దర్శింపలేదు. నా మీఁదఁ గోపముచేతనే కల్యాణమ్మ నన్నుఁ బంపివేసెనని మొదట నేను విచారించితిని. కాని, ఆమె కోపము నా మీఁదఁగాక, అపవాదములు కల్పించిన జనుల మీఁదనే యని యిపుడు స్పష్టమయ్యెను. తన శీలమును సంశయించినట్లు గానఁబడిన పెనిమిటి మీఁదను ఆకలికి కినుక వహించి యుండును. పనిలేని పేరంటముగ నేను వారి యింటికిఁబోవుచు వారిబంధువుల యీర్ష్యకుఁ బాల్పడుటవలనఁగదా, ఆ సుచరితమీఁద నీ వాదులు దొరలినవని నే నెంతయు వంతఁ బొందితిని. ఆదంపతులు నాతో నిఁక మాటాడకున్నను, నాకుఁదెలిసిన సత్యము వారికి విన్నవించుట యుక్తమని నేనెంచి, నాఁటి సాయంకాలము పూఁదోటలో నేను వినిన సంభాషణమంతయుఁ బూస గ్రుచ్చినట్టుగ భానోజీరావు పంతులుగారి కొక లేఖ వ్రాసి తెలిపితిని. సత్యము దైవమున కెఱుక. ప్రస్తుతము విపరీత పరిస్థితుల ననుసరించి నాయెడఁ దటస్థభావముతో నున్నను, పూర్వము నన్నెంతో దయతోఁ జూచిన యా దంపతులయెడ నేను కృతజ్ఞతగలిగి, వారి శ్రేయస్సును గోరుచుందును.

ఇప్పటికి నేఁ గల్యాణమ్మనుజూచి పది పండ్రెండేండ్లయినది. ఈలోపున లోకమున పెక్కుమార్పులు గలిగినవి. భానోజీరావు పంతులు చాలకాలము క్రిందటనే డెప్యూటీ కలక్టరుపదవి నందెను. విద్యాపరిపూర్తియై నేను ప్రభుత్వోద్యోగమునఁ బ్రవేశించితిని. నాకుఁ జేకూరిన సకలశుభములందును, ఆ పుణ్యదంపతులను స్మరించుచుందును. కాని నాకును వారికిని కంటిచూపులు తప్పిపోయినవి. ఉత్తరప్రత్యుత్తరములును లేవు. ఇటులుండ మాగృహమున నిటీవల జరిగెడి యొక శుభకార్యసందర్భమున లేఖలు వ్రాయుచుండు నపుడు, నా బాల్యపుప్రాపకు లగు వీరిసంగతి జ్ఞప్తివచ్చెను. గృహస్థుల మర్యాద ననుసరించి వీరికిని శుభలేఖవ్రాసితినే కాని, వారు వచ్చెదరని నేఁ దలంపలేదు. ఎల్లలు దాఁటి పోయి దూరమున నున్నవారిని మా యింట జరుగనున్న యీ స్వల్ప శుభకార్యమునకు శ్రమపడిరావలయుననుట కూడ నా తలంపు కాదు.

ఇట్లుండఁగా, శుభకార్యదినమున మా బంధువులతో నొకస్త్రీ బండిచేసికొని, తన యిద్దఱు పిల్లలతో మాయింటికి వచ్చెను. మాయింటనుండు స్త్రీ లీమెను గుఱుతింపలేక, యొకరిమొగ మొకరు చూచుకొనఁజొచ్చిరి. వీ రెవరో కనుగొనెదమని నేను బోయితిని. సుమారు ముప్పదియేండ్ల వయస్సుగల యా స్త్రీని నే నెన్నఁడో చూచినట్లు తోఁచెను. నిదానించి చూచి, కల్యాణమ్మయని యానవాలుపట్టి, 'కక్కి' యని పిలిచి, యామెపాదములకు మ్రొక్కితిని. "నాయనా, మనోహరమా! బాగానున్నావా?" అని నాసేమ మడిగి యామె నన్నాశీర్వదించెను. ఇన్నియేండ్లకు తిరిగి యిట్టి మిత్రదర్శన మైన యీ దినము నిజముగ శుభదినమని నాకుఁ దోఁచెను. ఆ సాయంసమయమునఁ దీఱికఁ జేసికొని నేనును మాకక్కియు వెనుకటిసంగతులు ముచ్చటించుకొంటిమి. చెడుకలవలె వచ్చిన యా యాకాశరామన్నజాబులవలన మా సంతోషమున కానాఁడు భంగము గలిగెనుగదా యని మేము పరితపించితిమి. కాని, యీ యపనిందయే మా శీలమును జక్కగ శోధించెననియు, నీతివర్తనమును దిట్టపఱిచెననియు మేము కనుఁగొంటిమి. ఈ పాడుకలగనినపిదప తాను మరల మనసార నవ్వి యెఱుఁగనని మా కక్కి చెప్పి, కంట నీరు తెచ్చికొనినపుడు, పసిబాలునివలె నేనును వెక్కివెక్కి యేడ్చితిని!

చాఁటభారతమువలె నున్న నా యుత్తరమును ఆనాఁడు భానోజీరావుగారు మరల మరలఁ జదువుకొనిరఁట! కపటమును, కల్మషమును జంటగ నుండుననియెంచి, నాయమాయికత్వమే నానిర్దోషిత్వమున కమోఘచిహ్నమని యాయన విశ్వసించెను. ఇదిగాక నాజాబు మూలమున దోషారోపకుల పేరులిపుడు కొన్ని బయలుపడెను గాన, దూరపు బంధువగు బిందుమాధవుని, వాని యనుచరులను ఆయన యిపుడు గనుఁగొని పరీక్షింపఁగా, పశ్చాత్తప్తులై వారు నిజమంతయు నొప్పుకొనిరి. పతిప్రేమ విశ్వాసముల కావలఁ దాను మరలఁ బాత్రమ నైతినని కల్యాణమ్మ చెప్పినపుడు నాకుఁ గనుల నీరు గ్రమ్మెను. నా సహచరులు నుపాధ్యాయులును నా యకళంక వర్తనమును గుఱించి నొక్కి చెప్పుటచేత ఆ దంపతులు వెనుకటివలెనే నాయందు సదభిప్రాయము గలిగియుండిరి. కాని, యిది జరిగిన స్వల్పకాలమునకే వారు దూరదేశము వెడలిపోయిరి. ఆ పట్టణమునఁ జదువుచాలించుకొని నేనును వేఱొక తావునకు వెడలిపోతిని. అందువలననే వారు నన్ను మరలఁ గలిసికొన లేకపోయిరఁట. నాతో నుత్తరప్రత్యుత్తరములు నడుపుటకును వారికి వలనుపడకుండెను. ఉత్తర ప్రత్యుత్తరములు లేకయే కొంత కాలము గడచిపోవుట యుక్తమని వా రూరకుండిరి. కాని, యిటీవల వారికి నామీఁద మరల ప్రేమ వాఁటెను. ఇంతలో నాశుభలేఖ కూడ వారికందెను. నా యాహ్వానమును మన్నించి పంతులుగారు, తమ భార్య నీ నాఁడు మా యింటికిఁ బంపిరి. పరిస్థితు లిట్లు పరిణమించుటకు నే నీశ్వరుని గీర్తించితిని.

ఒకసంగతి మాకక్కి నడుగవలయునని నే నాత్రముతో నుంటిని. నా విద్యాపరిపూర్తియై, ఉద్యోగసంపాదనమును గుఱించి యోజించుచుండు మొదటిదినములలో, మండలన్యాయాధిపతి కొలువులో నొకపని 'ఖాళీ' యయ్యెను. దానికొఱకై నాకంటె విద్యాధికులు, ననుభవశాలులు నగు నుమేజువార్లు పెక్కండ్రు ప్రయత్నించుచుండిరి. పెద్దవారి ప్రాపులేని నేను దీని కాసించుట అందనిమ్రానిపండ్ల కఱ్ఱులుసాచుట యని తలంచుచుంటిని. ఇట్లుండ నొకనాటి ప్రాతఃకాలము, ఆన్యాయస్థానమునందలి పెద్ద యధికారియొద్దనుండి పరిచారకుం డొకండువచ్చి, నన్ను వారు పిలువ నంపిరని చెప్పెను. నేను వారిదర్శనము చేయఁగా, వారి ప్రియమిత్రు లొకరికోరిక ననుసరించి నాకుం దా మీయుద్యోగ మీయ సంసిద్ధులుగ నుంటిమని వారు చెప్పిరి. ఎదురు చూడని యీ భాగ్యమున కెగిరి గంతువైచి, నే నానాఁడే యాపదవిని జేకొంటిని. ఆయధికారి దయయే యుద్యోగమున నే నిటు లభివృద్ధినొందుటకుఁ గారణమయ్యెను. వారిచే నా కీసహాయముచేయించిన మిత్రునిపేరు తెలిసికొనవలయునని నే నెంత యత్నించినను, సాధ్యము కాలేదు. నీ కేమైనఁ దెలియునా యని నే నడుగఁగా, కల్యాణమ్మ, మందహాసమునఁ దన సుందరవదనము సొబ గొందుచుండఁగా, ఎంతయో గుట్టుతో నుంచవలయునని తన పతిచేసిన యీ స్వల్పసాహాయ్యమును తన యక్కకొడుకు కీ విధమున రచ్చకీడ్చుట పాడిగాదని చెప్పివైచెను!

ఊరక యుద్యోగములు గావు; కారణము లేక యేకుటుంబమునఁగాని నామకరణములును గలుగనేరవు. మఱునాటి సాయంకాలమున నేను వ్రాఁతపని చూచుకొనుచుండఁగా, అనతిదూరమున నాఁడువారి ప్రసంగములు వీనులకు సోఁకెను. కల్యాణమ్మ పెద్దకుమారుని ముద్దులాడుచు నా భార్య "నీ పేరేమని" యడిగి, "చిన్న మనోహర" మను వాని ప్రత్యుత్తరమున కచ్చెరు వొంది, "నీయన్న పేరేవరోయి?" యని యడుగఁగా, 'మనోహర' మని వాఁడు చెప్పి, నన్నుఁ జూపించెను! మాటాడుట కదను దొరకెనా పిల్ల లూరకుండువారు కారు. "నా పేరు కూడా చెప్పనా?" యని నా చిన్నికూఁతు రంత కల్యాణమ్మ యొడిలోఁ జేరి, ఆమె చెవిలో 'కల్యాణి' యని రహస్యముగఁ జెప్పెను! "నీ కెవరిపేరు పెట్టినారమ్మా?" యని మా కక్కి యడుగఁగా, మాటకారియగు నీబాలిక, "మా చిన్న బామ్మ పేరు పెట్టినార" ని చెప్పివైచెను! ఆనంద బాష్పములు తనసుందర నయనములనుండి స్రవించుచుండ, మా కక్కి యా బాలిక నక్కున నదిమి ముద్దాడెను. ఏమను మాటకెవరి వశము?

సంపూర్ణము